పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 322 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం శనివారం 26 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 322 PAGES : 8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : THADEPALLI GUDEM SAT 26 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

గంగమ్మ ఒడికి
ఖైరతాబాద్ మహాగణపతి..
ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

- హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి
- 69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం
- క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం
- పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు.

- మిగతా 2లో

బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

- ఖైరతాబాద్ గణేశ్ శోభాయాత్రలో డ్యాన్స్ చేసిన దానం నాగేందర్
- మహిళా కానిస్టేబుళ్లతో కలిసి స్టెప్పులేసిన వైనం
- 'ప్యారడైజ్' సినిమా పాటకు డ్యాన్స్ చేసి ఉత్సాహం పంచారు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో
- బడా గణేశ్ నిమజ్జన వేడుకల్లో చోటుచేసుకున్న ఘటన

పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్
అహ్మదాబాద్ పర్యటన

- టోరెంట్, వెల్ స్పన్, ఆస్టల్.. అహ్మదాబాద్‌లో రెండో రోజు కూడా నారా లోకేశ్ బిజీబిజీ
- అహ్మదాబాద్ పర్యటనలో పారిశ్రామిక దిగ్గజాలతో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం ఏపీని ఎంచుకోవాలని టోరెంట్ గ్రూప్‌కు పిలుపు
- విశాఖలో టైర్ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుపై పలు సంస్థలతో కీలక చర్చలు
- కాకినాడ, నెల్లూరులలో ఇండస్ట్రియల్ పార్కులు, రిఫైనరీలు స్థాపించాలని విజ్ఞప్తి
- లోకేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించిన కంపెనీలు

పెన్ పవర్ డెస్క్:ఏపీకి పెట్టుబడులే లక్ష్యంగా ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విస్తృత పర్యటనలు కొనసాగిస్తున్నారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ టూర్‌లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఆయన పలు పారిశ్రామిక దిగ్గజాలతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ఏడు ప్రముఖ సంస్థల అధిపతులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, టెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్లు,

- మిగతా 2లో

ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్
ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

- ఏపీలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త
- కానిస్టేబుల్ డ్రైవర్ పోస్టుల నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్
- ప్రభుత్వ పాత ఉత్తర్వులను సవరిస్తూ కొత్త జీవో జారీ
- పోలీస్ రవాణా విభాగంలో 198 పోస్టుల భర్తీకి రంగం సిద్ధం

- మిగతా 2లో

ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి
అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- తీవ్ర వాయుగుండం వల్ల రాష్ట్రంలో పంట నష్టంపై తక్షణ అంచనాకు ఆదేశం
- పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు సూచన
- ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- పొలాల్లోని నీటిని తొలగిస్తూనే, భవిష్యత్తు కోసం నిల్వ చేయాలని దిశానిర్దేశం
- రైతులకు సాంకేతిక సలహాలు అందించి అండగా నిలవాలని స్పష్టం

పెన్ పవర్ డెస్క్:తీవ్ర వాయుగుండం ప్రభావంతో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేసినట్టు ఆయన వెల్లడించారు.

- మిగతా 2లో

మహిళలను పారిశ్రామికవేత్తలుగా
తీర్చిదిద్దడమే లక్ష్యం

- విజయవాడలో తొలిసారి నేషనల్ సరస్ ప్రదర్శన
- ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- మహిళా సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం, వారి ఆర్థిక సాధికారతను పెంపొందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'నేషనల్

- మిగతా 2లో

ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- ప్రస్తుత నియామక చట్టాన్ని సవరించాలని కేంద్రానికి డిమాండ్
- ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా కమిటీలో ఉండాలన్న జగన్
- ఈసీలో కమిషనర్ల అభ్యంతరాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచన
- ఏపీలో గతంలో తమ అభ్యంతరాలను పట్టించుకోలేదని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ)లో అంతర్గత విభేదాలు ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనం రావడం, దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేగడంపై వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం జగన్ స్పందించారు.

- మిగతా 2లో

సీఈసీ రాజీనామాకు డిమాండ్.. దేశవ్యాప్తంగా నిరసనలు..

ఓట్ల దొంగలను వదిలిపెట్టమంటూ నినాదాలు

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఓట్ల దొంగ, దేశద్రోహి,

- మిగతా 2లో

స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి

సీఎం విజయ్ ఆగ్రహం

- వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
- డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు
- ఈ విషయంలో డీఎంకే, ఏఐఏడీఎంకే కుమ్మక్కయ్యాయని విమర్శ
- ఉప ఎన్నికల ప్రచారంలో స్టాలిన్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన సీఎం విజయ్

- మిగతా 2లో

'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

పెన్ పవర్ డెస్క్: ఉత్తర్‌ప్రదేశ్‌లో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణులతో దాయాది పాకిస్థాన్ నిద్రలేని రాత్రులు గడుపుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే-203 రైఫిళ్లు మావోయిస్టులు, ఉగ్రవాదులను బెంబేలెత్తిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు శత్రు స్థావరాలను

- మిగతా 2లో

సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు.. ఢిల్లీ హైకోర్టు నోటీసులు

పెన్ పవర్ డెస్క్:జంతర్ మంతర్ నిరసనల్లో ఓ మహిళ ఫొటోల ప్రదర్శనపై ఢిల్లీ హైకోర్టు సీజేపీ ప్రతినిధులకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే తోపాటు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకా,

- మిగతా 2లో

ఎన్నికల సంఘంలో విభేదాలు అంటూ కథనం..
ఆందోళన వ్యక్తం చేసిన జగన్

- మొదటి పేజి తరువాయి

ఈసీ పనితీరు, నియామకాల పద్ధతిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం నిలబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఉద్దేశించిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్, 2023'ను పునఃసమీక్షించి, సవరించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇటీవల జాతీయ మీడియాలో వచ్చిన కథనాలను జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఈసీఐనెట్ నిర్వహణ వంటి అంశాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్తలు ప్రజల్లో తీవ్రమైన ప్రశ్నలు, సందేహాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే.. ఏయే అంశాలపై అభ్యంతరాలు నమోదయ్యాయి, వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు, ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పులు, తొలగింపులు, పునరుద్ధరణ ప్రక్రియ ఎంత పారదర్శకంగా జరిగిందనే దానిపై ప్రజలకు స్పష్టత అవసరమని జగన్ నొక్కిచెప్పారు. ఈ విషయాలపై ప్రజలకు నమ్మకం కలిగించే చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు.ఈ నేపథ్యంలో, గతంలో తాము కూడా మద్దతు ఇచ్చిన 2023 నాటి ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని జగన్ పేర్కొన్నారు. ఈ భయాలను తొలగించి, సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వమే ముందుకు రావాలని కోరారు. ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)లతో కూడిన త్రిసభ్య కమిటీ ద్వారానే ఎన్నికల కమిషనర్లను నియమించే పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. "పరీక్ష రాసే విద్యార్థే, తన ఎగ్జామినర్ ను నియమించుకుంటే, ఆ అధికారి ఎంత నిజాయతీపరుడైనా ఆరోపణలకు ఆస్కారం ఉంటుంది. ఆ స్థానంలో ఒక తటస్థ వ్యక్తి ఉంటేనే మేలు" అని జగన్ ఉదహరించారు. ఈ మార్పు ఎన్నికల సంఘంపై ప్రజల గౌరవాన్ని, విశ్వాసాన్ని కచ్చితంగా పునరుద్ధరిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆంధ్రప్రదేశ్‌లో తమ పార్టీ ఎదుర్కొన్న అనుభవాలను కూడా జగన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఏపీలో ఎస్ఐఆర్ (ూ×=) ప్రక్రియ సమయంలో అధికార పార్టీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసిందని, అనేక సందర్భాల్లో తమ విజ్ఞప్తులను పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలోనూ డివిజన్ల పునర్విభజన తీరుపై ప్రతిపక్షంగా తాము లేవనెత్తిన అభ్యంతరాలను పక్కన పెట్టేశారని అన్నారు. ఇలాంటి చర్యలు ఎన్నికల ప్రక్రియపై ప్రజా విశ్వాసాన్ని బలహీనపరుస్తాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండటమే కాదు, అవి ఉన్నట్టుగా కనిపించాలని, వాటిని కాపాడటమే రాజ్యాంగ సంస్థల ప్రాథమిక విధి అని జగన్ తన పోస్టులో స్పష్టం చేశారు.

ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రు

సీఈసీ రాజీనామాకు డిమాండ్..
దేశవ్యాప్తంగా నిరసనలు..

- మొదటి పేజి తరువాయి

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. పరస్పర ప్రయోజనాలకోసం ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ తో కుమ్మక్కై ఎన్నికల వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల దొంగలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని శపథం చేశారు.

యూపీ, లక్నోలో..

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ యూపీ రాజధాని లక్నోలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. ఓట్ల దొంగతనానికి పాల్పడి జ్ఞానేష్ దేశద్రోహానికి పాల్పడ్డారు..ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగే అర్హత ఆయనకు లేదు. ఓట్లను దొంగిలించి ప్రజాస్వామ్యంపై ప్రత్యక్ష దాడి చేశారు, ఇది క్షమించరాని నేరమని ఆయన తక్షణమే పదవి నుండి తొలగించి, అరెస్టు చేయాలని నిరసనకారులు నినాదాలు చేశారు.

పశ్చిమ బెంగాల్ లో..

దేశ ద్రోహుల చేతినుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఎలక్షన్ సిస్టమ్ లో జవాబుదారీతనం కావాలని పశ్చిమ బెంగాల్ లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనను అరెస్టును డిమాండ్ చేశారు. క్విడ్ ప్రో కో (పరస్పర ప్రయోజనం) కోసం పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో జ్ఞానేష్ కీలక పాత్ర పోషించారని దుయ్యబట్టారు. అందుకే జ్ఞానేష్ కుమార్ కు పద్మ భూషణ్ పురస్కారం ఇవ్వాలని బీజేపీ వర్గాలు ఇప్పుడు డిమాండ్ చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ, సీఈసీ వీరంతా ఓట్ల దొంగల ముఠా అని నినాదాలు చేశారు.

పంజాబ్ లో..

ప్రజాస్వామ్యంలో ఓట్లను దొంగిలించడం దేశద్రోహమే అవుతుంది.. ఈ పనికి పాల్పడిన సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రిజైన్ చేయాలని , అయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్ లో ఆందోళనలు జరిగాయి. రాజ్ బ్రార్ నాయకత్వంలో పంజాబ్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. దీజ్రీ, -జజుజల నిరంకుశ పోకడను సవాల్ చేశారు.

హర్యానాలో..

ఓట్ల చోరీలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వెంటనే జ్ఞానేష్ కుమార్ అరెస్ట్ చేయాలని హర్యానా కాంగ్రెస్ నేతృత్వంలో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ప్రజల హక్కులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇక జ్ఞానేష్ కుమార్ ప్రధాని మోదీ కూడా కాపాడలేరని స్పష్టం చేశారు కాంగ్రెస్ నేతలు. ఈ నిరసనల్లో భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. భారీ ర్యాలీగా వస్తున్న కార్యకర్తలను బారికేడ్లు పెట్టి పోలీసులు అడ్డుకున్నారు. నిరసనకారులపై వాటర్ క్యానన్లు ప్రయోగించారు.

బిహార్ లో..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ దేశద్రోహానికి పాల్పడ్డారని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీహార్ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. నిరసనల్లో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మణిపూర్ లో..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నిరసనలు తలెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవి నుంచితొలగించి అరెస్ట్ చేయాలని ఓక్రమ్ ఇబోబి సింగ్ నేతృత్వంలోని మణిపూర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆందోళనలు చేపట్టింది. ప్రజాస్వామ్యాన్ని ఖూని చేసిన దేశ ద్రోహికి కఠిన శిక్ష పడేవరకు నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

ఒడిశాలో..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా, అరెస్ట్ ను డిమాండ్ చేస్తూ ఒడిశాలో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఎన్నికల వ్యవస్థలో జవాబుదారి తనం కోరుతూ ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. రాజ్యాంగం చేతబట్టుకొని ప్రధానిమోదీ, జ్ఞానేష్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తే ఆందోళన వ్యక్తం చేశారు.

సిమ్లా, హిమాచల్ ప్రదేశ్ లో..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఓట్లను చోరీ చేసి దేశ ద్రోహానికి పాల్పడ్డారు. ఇది ఎప్పటికీ క్షమించరాని నేరం. జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలి. అతడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. యువత, మహిళలు నిరసనల్లో పాల్గొని ప్రధాని మోదీ, జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్, అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం సమక్షంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ లో..

సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఉత్తరాఖండ్ లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖంవడ్ ఇన్‌ఛార్జ్ జనరల్ సెక్రటరీ కుమారి సెల్జా జీ, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ గోడియాల్ జీ , జూరా నేతల యశ్పాల్ ఆర్య జీ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఓట్లను దొంగిలించి జ్ఞానేష్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

జమ్మూ కాశ్మీర్ లో..

సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా జమ్మూ కాశ్మీర్ లో పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. జ్ఞానేష్ కుమార్ ను పదవినుంచి తొలగించాలని, అరెస్ట్ చేయాలని, ఓట్ల దొంగతనం చేసినందుకు గాను కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి...

ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

బడా గణేశ్ శోభాయాత్ర: పోలీసులతో కలిసి స్టెప్పులేసిన దానం నాగేందర్

హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర వైభవంగా సాగుతోంది. ఈ వేడుకల్లో భాగంగా దానం నాగేందర్ ఉత్సాహంగా నృత్యం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శుక్రవారం వైభవంగా సాగుతున్న శోభాయాత్రలో ఈ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు మహిళా కానిస్టేబుళ్లతో

కలిసి దానం నాగేందర్ నృత్యం చేశారు. ఇటీవల విడుదలైన 'ప్యారడైజ్' చిత్రంలోని ఒక పాటకు ఆయన ఉత్సాహంగా స్టెప్పులు వేసి వేడుకల్లో జోష్ నింపారు. పండుగ వాతావరణంలో ఆయన చేసిన ఈ నృత్యం అక్కడ ఉన్న భక్తులను, చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానం నాగేందర్ నృత్యంపై నెటిజన్లు విభిన్న రీతుల్లో స్పందిస్తున్నారు. కొందరు ఆయనలోని ఉత్సాహాన్ని ప్రశంసిస్తుండగా, మరికొందరు ఈ అంశంపై రాజకీయ కోణంలో వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఏపీలో వర్ష బీభత్సం.. అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయిలో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ఈ మేరకు ఆయన ఉన్నతాధికారులతో శుక్రవారం ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బూడితి రాజశేఖర్, ఇతర ఉన్నతాధికారులతో పాటు పార్వతీపురం మన్యం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టంపై వెంటనే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించి, వివరాల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, అధిక తేమ వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు అందించి, వారిలో అవగాహన కల్పించాలని సూచించారు.ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా దెబ్బతిన్న ముఖ్యమైన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను సమీక్షించాలని స్పష్టం చేశారు.

అదే సమయంలో, ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సాధ్యమైనంత మేర సంరక్షించుకోవాలని మంత్రి సూచించారు. పంటలకు హాని కలిగించే చోట నీటిని తొలగిస్తూనే, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల్లో నీటిని నిల్వ చేసి భవిష్యత్తు సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు, ప్రజలకు నిరంతర సహాయం అందించాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు.

'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

- మొదటి పేజి తరువాయి

నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు.ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమై ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.

స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి

తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు.అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి,

మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో పోలీసులు బాధితులను గుర్తించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, టీవీకే, డీఎంకే మధ్య ఇది ప్రధాన రాజకీయ పోరాటంగా మారింది.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

సరస్ ప్రదర్శన' ఏర్పాట్లను రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెట్ సౌకర్యాన్ని కల్పించడమే ధ్యేయంగా నేషనల్ సరస్ మేళాను ఢిల్లీ నుంచి విజయవాడకు తీసుకువచ్చామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే మహిళా పారిశ్రామికవేత్తల కోసం 350కి పైగా స్టాళ్లను సిద్ధం చేస్తున్నామని, ఇందులో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే సుమారు 250 స్టాళ్లు ఉండబోతున్నాయని చెప్పారు. ఇతర రాష్ట్రాల విజయగాథలు, అనుభవాలను పంచుకునేలా ఈ మేళాను ఒక ప్రత్యేక 'లెర్నింగ్ సెంటర్'గా మలుస్తున్నామని పేర్కొన్నారు.అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు తయారు చేసే నాణ్యమైన ఉత్పత్తులకు గుర్తింపు కల్పించేందుకు 'స్వయం ఏపీ' అనే ప్రతిష్ఠాత్మక బ్రాండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. దీని ద్వారా బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ అంశాల్లో మహిళలకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. దసరా ఉత్సవాల వేళ విజయవాడకు ఈ ఈవెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, సందర్శకుల సౌకర్యాలు, భద్రత మరియు పార్కింగ్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులతో విస్తృత సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ అహ్మదాబాద్ పర్యటన

- మొదటి పేజి తరువాయి

తయారీ వంటి కీలక రంగాల్లో ఏపీలో ఉన్న అవకాశాలను వారికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలియజేసి, పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానించారు. లోకేశ్ ప్రతిపాదనలపై కంపెనీల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి, వాటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.క్లీన్ ఎనర్జీలో ఏపీని ఎంచుకోండి: టొరెంట్ గ్రూప్‌తో లోకేశ్‌ఫార్మా, పవర్ రంగాల్లో అగ్రగామిగా ఉన్న టొరెంట్ గ్రూప్ చైర్మన్ సమీర్ మెహతా, ఇతర డైరక్టర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఫార్మా క్లస్టర్లలో ఏపీఐ, ఇంటర్మీడియట్ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని కోరారు. ముఖ్యంగా, పునరుత్పాదక ఇంధన రంగంలో టొరెంట్ గ్రూప్ ప్రణాళికలను ప్రస్తావిస్తూ.. సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులకు ఏపీ అనువైనదని తెలిపారు. పంప్డ్-స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్ వంటి క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీర్ మెహతా స్పందిస్తూ.. 2030 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించడమే తమ లక్ష్యమని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తప్పక పరిశీలిస్తామని చెప్పారు.కాకినాడలో ఇండస్ట్రియల్ పార్క్: వెల్ స్పన్ గ్రూప్‌కు ప్రతిపాదనటెక్స్‌టైల్స్, మౌలిక సదుపాయాల రంగంలో ప్రసిద్ధిగాంచిన వెల్ స్పన్ వరల్డ్ గ్రూప్ సీఈఓ నితిన్ జైన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. గతంలో దావోస్‌లో సీఎం చంద్రబాబుతో జరిగిన చర్చల పురోగతిని సమీక్షించారు. విశాఖపట్నంలో వెల్స్‌పన్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. కాకినాడలో టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, పైపుల తయారీ, గ్రీన్ అమ్మోనియా యూనిట్లతో కూడిన ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నితిన్ జైన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కర్నూలు, కడపలో తమ సంస్థ 100 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును నిర్వహిస్తోం దని, తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

నెల్లూరులో ఆయిల్ రిఫైనరీలు: గోకుల్ ఆగ్రోతో చర్చలు

వంట నూనెల తయారీలో పేరొందిన గోకుల్ ఆగ్రో రిసోర్సెస్ చైర్మన్ కనుభాయ్ ఠక్కర్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌కు అదనంగా పామాయిల్, సోయాబీన్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై కనుభాయ్ ఠక్కర్ స్పందిస్తూ.. కృష్ణపట్నంలో తమ ప్లాంట్ 2024 నుంచి ఉత్పత్తి ప్రారంభించిందని, దక్షిణాది మార్కెట్ల కోసం విస్తరణ ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

విశాఖలో టైర్ల తయారీ యూనిట్: చిరిపాల్ గ్రూప్‌కు ఆహ్వానం

టెక్స్‌టైల్స్, కెమికల్స్ రంగాల్లోని చిరిపాల్ గ్రూప్ మేనేజింగ్ డైరక్టర్ బ్రిజ్ మోహన్ చిరిపాల్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విశాఖపట్నం కనెక్టివిటీ, మౌలిక వసతులను వివరిస్తూ.. అక్కడ గ్రీన్‌ఫీల్డ్ టైర్ల తయారీ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై బ్రిజ్ మోహన్ చిరిపాల్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమకు పలు రాష్ట్రాల్లో తయారీ యూనిట్లు ఉన్నాయని, టైర్ల తయారీకి సంబంధించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని అన్నారు.

డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టండి: ఎస్టీ టెలీమీడియాతో లోకేశ్

డేటా సెంటర్ల దిగ్గజం ఎస్టీ టెలీమీడియా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ జెనాతో లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా ఎదుగుతోందని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. దీనిపై గౌతమ్ జెనా స్పందిస్తూ.. తమ సంస్థ కార్యకలాపాలను వివరించి, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు.

విశాఖలో ప్రీ ఫ్యాబ్ కేంద్రం: ఈప్యాక్ గ్రూప్‌తో భేటీ

ప్రీ ఫ్యాబ్ నిర్మాణ రంగంలో పేరొందిన ఈప్యాక్ గ్రూప్ చైర్మన్ భజరంగ్ బోత్రాతో లోకేశ్ సమావేశమయ్యారు. డేటా సెంటర్ల నిర్మాణానికి అవసరమైన ప్రీ ఫ్యాబ్ నిర్మాణ కేంద్రాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని కోరారు. భజరంగ్ బోత్రా మాట్లాడుతూ.. ఇప్పటికే శ్రీసిటీలో తమకు తయారీ యూనిట్లు ఉన్నాయని, విశాఖ ప్రతిపాదనను కూడా పరిశీలిస్తామని తెలిపారు.

పైపుల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: ఆస్ట్రల్ పైప్స్‌తో సమావేశం

పైపుల తయారీలో అగ్రగామిగా ఉన్న ఆస్ట్రల్ పైప్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ అల్కేష్ పంచల్‌తో మంత్రి లోకేష్ చర్చలు జరిపారు. రాష్ట్రంలో నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నందున, కాకినాడ లేదా అనకాపల్లిలో పైపుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అల్కేష్ పంచల్ స్పందిస్తూ.. తమకు దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఏపీ హోంగార్డులకు శుభవార్త.. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హోంగార్డులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. పోలీస్ శాఖలో స్టిపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల నియామకాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతంలో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను (జీవో) సవరిస్తూ నూతన ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయం సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న హోంగార్డులకు పెద్ద ఊరటనిచ్చింది.పోలీస్ రవాణా సంస్థ (ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్) పరిధిలో 198 స్టైపెండరీ కానిస్టేబుల్ (డ్రైవర్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెలలోనే విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ నియామక ప్రక్రియ నుంచే హోంగార్డులకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్ అమలులోకి రానుంది.నూతన రిజర్వేషన్ విధానం ద్వారా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరాలనుకుంటున్న అర్హులైన హోంగార్డులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం పట్ల హోంగార్డుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కేకు.. ఢిల్లీ హైకోర్టు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రత్న సింగ్ లకు నోటీసులిచ్చింది. అనుమతి లేకుండా తన ఫొటోలు తీసి డిజిటల్ మార్ఫింగ్ చేశారని ఓ మహిళనుంచి ఇచ్చిన ఫిర్యాదుతో స్పందించిన కోర్టు ఈ చర్యలు తీసుకుంది. అక్టోబర్ 2న దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ రెడీ అవుతున్న క్రమంలో హైకోర్టు నోటీసులు చర్చనీయాంశమయ్యాయి. తన అనుమతి లేకుండా ఫోటో తీసి, ఆ తర్వాత ఏఐ, ఫేస్-స్వాపింగ్ టూల్స్ ఉపయోగించి డిజిటల్‌గా మార్ఫింగ్ చేశారని ఓ మహిళ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం.. ప్రధాని మోదీతో కలిసి ఉన్న తన ఫోటోపై ఆమె ముఖాన్ని మార్ఫింగ్ చేశారని ఆరోపించింది. ఫిర్యాదులో సీజేపీ ప్రతినిధులు సౌరభ్ దాస్, అభిజీత్ దీప్కే, అశుతోష్ రాంకా, రత్న సింగ్‌లతో పాటు వారి సహచరులుగా ఆరోపించబడిన కొందరి పేర్లను పేర్కొంది.జంతర్ మంతర్ నిరసనల్లో మార్ఫింగ్ చేసిన తన ఫొటోలను ప్రచారం చేయడంతో తనకు బెదిరింపులు వస్తున్నాయని, తనకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ కేసులో మహిళకు పూర్తి రక్షణ కల్పించాలని శుక్రవారం ఢిల్లీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మహిళ భద్రతకోసం ఆమె అడ్రస్ సీక్రెట్ గా ఉంచాలని పోలీసులకు సూచించింది. దీంతోపాటు వెబ్ లింకులనుంచి , సోషల్ మీడియా ప్లాట్ ఫాంలనుంచి ఆమె ఫొటోలను తొలగించాలని మెటాకు ఆదేశించింది. ఈ కేసు ఢిల్లీ హైకోర్టులో ఉండగా, పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. సీఈసీ రాజీనామా చేయాలని అక్టోబర్ 2న సీజేపీ తలపెట్టిన దేశవ్యాప్త నిరసనలకు ముందు హైకోర్టు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

అక్టోబర్ 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

బ్యాంకు సమ్మె నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 25: సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో బ్యాంకులు సమ్మె నేపథ్యంలో సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను అక్టోబర్ 1న పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని 2,65,945 మంది లబ్ధిదారులకు రూ.117.19 కోట్ల పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1న ఉదయం బ్యాంకుల నుంచి నగదును సమకూర్చుకుని, మధ్యాహ్నం నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దే పెన్షన్లు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యాంకుల అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన నగదు ముందుగానే అందుబాటులో ఉంచాలని, పెన్షన్ తేదీలో మార్పును లబ్ధిదారులకు ముందుగానే తెలియజేసి సజావుగా పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

శబరి బ్రిడ్జి వద్ద నీటి మట్టం పరిశీలించిన జేసీ ప్రశాంత్ కుమార్...

-ముంపు ముప్పుపై అధికారులు సిద్ధంగా ఉండాలి

కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 25. పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ కూనవరం మండలం శబరి బ్రిడ్జి వద్ద గోదావరి,శబరి నది నీటి మట్టాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్,చింతూరు ఐటీడీఏ పిఓ శుభం నొక్వల్ శుక్రవారం పరిశీలించారు.వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి తలెత్తబోయే పరిస్థితులు, ముంపు ముప్పుపై అధికారులను అప్రమత్తం చేశారు.లోతట్టు ప్రాంతా ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు,పునరావాస కేంద్రా ల ఏర్పాటుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బ్రిడ్జి వద్ద అధికారులు, స్థానికులతో మాట్లాడిన జేసీ,వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కల గకుండా చూడాలని సూచించారు.

పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

అంగన్వాడీ సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి: సీడీపీవో సుచరిత ఆదిలక్ష్మి

గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25: చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో కీలకమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గంగవరం ఐసీడీఎస్ సీడీపీవో వి. సుచరిత ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం గంగవరం ఐసీడీఎస్ పరిధిలోని పి. రామవరం, నెల్లిపూడి తదితర అంగన్వాడీ కేంద్రాల పరిధిలో నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవాలు, 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్యమైన పోషకాహారం అవసరమన్నారు. గర్భిణులు, బాలింతలు కూడా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవలపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పోషకాహారం ప్రాధాన్యత, సమతుల్య ఆహారం, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు పోషకాహార లోపం లేకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, చిన్నారుల అభివృద్ధి, తల్లులు మరియు పిల్లల ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమాలకు స్థానిక నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై అంగన్వాడీ సిబ్బంది సేవలను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో సూపర్వైజర్ పి. సీత, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్హెచ్వీలు, లబ్ధిదారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బీజేపీ మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్య రాజు

చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా చింతూరు మండలంలోని బూత్ నంబర్ 348 పరిధిలో ఆయన చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్య రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య రాజు మాట్లాడుతూ అంత్యోదయ భావనతో ప్రతి వ్యక్తి అభ్యున్నతి, ప్రతి భారతీయుడి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. అంత్యోదయ, సర్వోదయ స్ఫూర్తితో సమాజంలోని ప్రతి ఒక్కరి సంక్షేమానికి కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తుఫాన్ నేపథ్యంలో ఏజెన్సీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని బట్ట లక్ష్మయ్య రాజు విజ్ఞప్తి చేశారు. పలు ప్రాంతాల్లో బలమైన గాలులు వీచే అవకాశం ఉండటంతో పాటు వాగులు, వంకలు పొంగిపొర్లే పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉందన్నారు. అత్యవసర పరిస్థితి తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం ప్రాంతాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శబరి నది ప్రమాద స్థాయికి చేరువవుతున్న నేపథ్యంలో ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో ఉన్నవారి విషయంలో కుటుంబ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, సెప్టెంబర్ 25: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సూచించారు. శుక్రవారం రాజవొమ్మంగి మండలం నెలిమెట్ల గ్రామంలో వాగులు, కాలువల పరిస్థితిని టీడీపీ నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలకు వాగులు, కాలువలు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు వాటి వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటి ప్రవాహం ఉన్న రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. చిన్నారులను నీటి ప్రవాహాల వద్దకు అనుమతించవద్దన్నారు. అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

ఇల్లు కూలిన బాధితుడికి పరామర్శ

రాజవొమ్మంగి మండలం డి.మల్లవరం గ్రామంలో వర్షాలకు ఇల్లు కూలిపోయిన సెగ్గి అర్జిబాబు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తాటాకుల ఇళ్లలో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ వైర్లను తాకవద్దని సూచించారు. అలాగే ఇంటి గోడ కూలిపోయిన కురుసల చంటికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించేది లేదు

రాజవొమ్మంగి, జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడి వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. రోగులకు సకాలంలో వైద్యం అందించాలని, వైద్య సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రతి చిన్న సమస్యకు రోగులను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేయకుండా సాధ్యమైనంత వరకు స్థానికంగానే వైద్యం అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆశ్రమ పాఠశాలలో తనిఖీ

అమీనాబాద్ ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార మెనూ, వంటశాల, నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి రాయితీలు, విద్యా సౌకర్యాలపై ఆరా తీశారు. నాణ్యమైన ఆహార పదార్థాలనే సరఫరా చేయాలని, నాసిరకం లేదా కాలం చెల్లిన సరుకులు వస్తే వెంటనే వెనక్కి పంపాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గణజాల తాతారావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు బారంగి అనుదీప్, కొంగర సావిత్రి, తంటికొండ పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు ఊట చిన్నబాబు, అమీనాబాద్ కాలనీ నాయకులు గంగిరెడ్ల బుజ్జయ్య, తహసీల్దార్ స్వామి, ఎస్ఐ చినబాబు, వెంకటరావు, వీఆర్ఓ ఎస్. నాగేశ్వరరావు, భారతి, వైద్యులు సుష్మ, జడ్డంగి వైద్యులు, పావని తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తుదారులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలి.

వైఎస్ఆర్ పార్టీ చేతువృత్తులు రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 25. తాడేపల్లిగూడెం డిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోరాడి సాధించుకోవాలని అన్నారు ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు ముఖ్యంగా విశ్వబ్రాహ్మణుల కుల వృత్తులైన స్వర్ణకార, వడ్రంగి, కంచర, కమ్మర, శిల్పి వృత్తిదారులందరికీ 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు చేతి వృత్తిదారులు పనులు లేక నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయి అల్లాడుతున్నారని అన్నారు వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గురజాడ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం సమావేశం జరిగిందని రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో విశ్వబ్రాహ్మణుల చైతన్యపరిచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేస్తానని అన్నారు అదేవిధంగా విశ్వబ్రాహ్మణ సంఘ ఐక్యత కోసం సంఘము ఎన్నికలకు తన వంతు సహకారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా శ్రీ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి పీఠం అధ్యక్షులు చింతాడ బ్రహ్మానందం గారు పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి చేతివృత్తిదారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయానికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్ ను పంపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెడపి ప్రసాద్, వేముల రామకృష్ణ, కిల్లంపల్లి ఆచారి, కొండిపర్తి రాజశేఖర్, కల్లూరి శ్రీవాణి, వేముల కన్నబాబు, బి శారద తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చుని వీఆర్ఏ ల నిరసన

పదో రోజుకు చేరిన వీఆర్ఏల దీక్ష

సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ :25:తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వీఆర్ఏలుఅర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల పిలుపు మేరకు సీతానగరం మండలంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు చేపట్టిన నిరసన దీక్ష పదవరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ వీఆర్ఏలు తమ కోర్కెల సాధన కోసం ఉద్యమం చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం శోచనీయం అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లయిన పే స్కేల్ అమలు చేయాలని, మృతి చెందిన వీఆర్ఏల నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని,అర్హులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు తమ దీక్షలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి వీఆర్ఏల మండల ప్రెసిడెంట్ సిద్దే మధుసూధనరావు, డివిజన్ ప్రెసిడెంట్ కన్నెం రాజేంద్రప్రసాద్, డివిజనల్ సెక్రెటరీ మద్దాల దుర్గారావు, వీఆర్ఏలు వెంకటేష్, నాని, తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో బీవీ ఆర్ పర్యటన.. రైతులు ప్రజలు ఇబ్బందులు పడకూడదు

సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:ఎడతెరిపిలేని వర్షాలు వల్ల నియోజకవర్గం లోని ఏ ఒక్క గ్రామంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆదేశించారు. కోరుకొండ సీతానగరం మండలాల్లో ఎక్కువగా చెరువులకు గండ్లు పడ్డాయని దీనివల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిందన్నారు. మండలంలోని రఘుదేవపురం సీతానగరం రాపాక రామచంద్రపురం తదితర ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి శుక్రవారం నాడు పర్యటించారు. మూడు రోజుల నుండి వరద నీటి కారణంగా ఏర్పడిన పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానికులనుఅధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ సహాయక చర్యలు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని అధికారులను కోరారు. వరద పరిస్థితుల్లో ప్రజలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండలం అధ్యక్షుడు గెడ్డం తిమ్మారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వలవల రాజా, ఓబులు నేని కృష్ణ చైతన్య, అనసు బాబు, గుర్రం ఉదయ్, సొసైటీ చైర్మన్ కాండ్ర శేఖర్, మండల ఎంపీడీవో భారతి, తాసిల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారానికి 10 లక్షల పరువు నష్టం నోటీసు...

విలేకరి రమేష్ కు మద్దతుగా సిపిఐ

కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్25. సోషల్ మీడియా వేదికగా విశాలాంధ్ర విలేకరి నెల్లూరి రమేష్ పైఅసత్య ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేసినందుకు కొక్కెరపాటి రవీంద్రకు 10 లక్షల రూపాయల పరువు నష్టం దావాకు సంబంధించిన లీగల్ నోటీసులు అందజేసినట్లు సిపిఐ డివిజన్ కార్యదర్శి గుజ్జా మోహన్ రావు తెలిపారు.శుక్రవారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో,వేలేరుపాడు మండలానికి చెందిన రవీంద్ర గత కొంతకాలంగా కూనవరం మండలంలో ఉంటూ వితంతు మరియు ఒంటరి మహిళ లను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పేరు తో మోసం చేస్తున్నారని పలువురు మహిళలు సిపిఐ దృష్టికి తీసుకువ చ్చారని పేర్కొన్నారు.ఏలూరు జిల్లా లో ఆ పని కేసుల్లో నిందితుడిగాఉన్న వ్యక్తి,కూనవరం మండలంలో ప్రభు త్వ గ్రీవెన్స్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. బాధితుల నుండి ఫిర్యాదులు చేయించి అనంతరం వారి నుండి డబ్బు డిమాండ్ చేస్తున్నారని తెలి పారు.ఈ నెల 9వతేదీన విశాలాంధ్ర విలేకరి రమేష్ ఇంటిపై తప్పుడు ఫిర్యాదు చేసి,సోషల్ మీడియాలో వీడియో ద్వారా ఆయనపై అసత్య ఆరోపణలు చేశారని మోహన్ రావు పేర్కొన్నారు.16 సంవత్సరాల అను భవం ఉన్న విలువలతో కూడిన పాత్రికేయుడిగా,ఏపీయూడబ్ల్యూజే చింతూరు డివిజన్ కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రమేష్ పై చేసిన ప్రచారం పరువు నష్టం కలిగించేలా ఉందని అన్నారు.ఇటువంటి చర్యలను సిపిఐ తీవ్రంగా ఖండి స్తుందని,ఇకపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు.బాధితులు ఐటీడీఏ మరియు పీజీఆర్ఎస్ వంటి అధికారిక వేదికలను ఉప యోగించుకోవాలని సూచించారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో స్థానిక 17వ వార్డులో నీట మునిగిన ఇల్లు..

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 25.మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నీట మునిగిన ఇల్లులు కనీసం నిలబడడానికి కూడా అవకాశం లేని విధంగా ఇంటిలోకి కూడా నీరు వెళ్లి ఇబ్బందులు పడుతున్న తరుణంలో విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ స్వయంగా వెళ్లి పరిస్థితిని పరిశీలించి.. నీటిని బయటకు తరలించే అవకాశం లేక నీటిని తోడే ఇంజన్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ ఇళ్లలో ఉన్నటువంటి వారిని సురక్షిత ప్రదేశంలో ఉండమని చెప్పి... తగు చర్యలు తీసుకునేలాగా తన సొంత ఖర్చులతో ఆ నీటిని బయటకు తోడేలా ప్రయత్నం చేస్తున్నారు. అదేవిధంగా 17,19,23,24 వార్డులలో కొన్ని ప్రాంతాలలో రోడ్లు నీట మునగడంతో... తన సొంత ఖర్చులతో జెసిబిని ఏర్పాటు చేసి ఆ నీటిని బయటకు గండ్లు కొట్టించి... ఆ వర్షపు నీరు బయటకు పోయేలా చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేశారు..

సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించిన ఏపీ నిట్ విద్యార్థులు

దక్షిణ జోన్ ఆవిష్కరణలకు ఏపీ నిట్ నేతృత్వం.

తాడేపల్లిగూడెం.పెన్ పవర్. సెప్టెంబర్ 25:బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సి)లో సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2026 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) విద్యార్థులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, లిటరేసీ, ఏఐసిటిఈ, యుజిసి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సి) బెంగళూరు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు, యువ ఆవిష్కర్తలు తమ చుట్టూ ఉన్న వాస్తవ సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక, వినూత్న, విస్తృత స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహించడమే ఈ 'సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్--2026 ముఖ్య ఉద్దేశ్యం. దీనికి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సి) బెంగళూరు దక్షిణ ప్రాంత నోడల్ ఇన్స్టిట్యూట్గా వ్యవహరిస్తుంది. ఇందులో (దక్షిణ ప్రాంతంలో) కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ ఏ నికోబార్ దీవులు, లక్షద్వీప్ మరియు పుదుచ్చేరి ఉన్నాయి.

ఏపీ నిట్ కీలక పాత్ర

దక్షిణ జోన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జోనల్ హెడ్గా ఏపీ నిట్ బాధ్యతలునిర్వర్తిస్తుందని ఇన్ఛార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు దక్షిణ జోన్ జ్యూరీ సభ్యులలో ఒకరిగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు మరియు యువతను భాగస్వామ్యం చేయడం (మొబిలైజేషన్), స్థానిక స్థాయి మూల్యాంకనం, ప్రతిభావంతమైన ఆవిష్కరణలను గుర్తించడం, జోనల్ స్థాయి ప్రదర్శనలను నిర్వహించడంతోపాటు షార్ట్లిస్ట్ చేసిన ఉత్తమ ఆవిష్కరణలను దక్షిణ ప్రాంత నోడల్ కేంద్రమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సి) బెంగళూరుకు సిఫార్సు చేసే కీలక బాధ్యతలను ఏపీ నిట్ కి అప్పగించారు. ఈ సందర్భంగా ఏపీ నిట్ ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.సందీప్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ యువతలో సృజనాత్మక ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు సమాజ హిత ఆవిష్కరణల రూపకల్పనకు కృషిచేస్తూ వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ జాతీయ స్థాయి ఛాలెంజ్లో 12వ తరగతి వరకు పాఠశాల విద్యార్థులు, ఐటిఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు, అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు మరియు అర్హత కలిగిన యువ ఆవిష్కర్తలు పాల్గొనవచ్చని చెప్పారు. ఎంపికైన ఆవిష్కర్తలకు మెంటార్షిప్, సాంకేతిక సహాయం, ప్రయోగశాలలు మరియు ఫ్యాబ్రికేషన్ సదుపాయాలు, ఇంక్యుబేషన్, పైలట్ సపోర్ట్ మరియు ఫీల్డ్ టెస్టింగ్ వంటి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యాసంస్థలు తమ విద్యార్థులు, అధ్యాపకులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి, విస్తృతంగా పాల్గొనేలా ప్రోత్సహించాలని వివరించారు.

కొండ్రాజుపేట కాజ్వే పై వరద

-10 గ్రామాలకు రాకపోకలు స్తంభన

కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్25. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో గోదావరి,శబరి పరివాహక ప్రాంతాల్లో కురిసినభారీ వర్షాలకు వరద ముంపు పొంచి ఉందని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వల్ అధికారులను అప్రమత్తం చేశారు.ముంపు ప్రాంతాల్లో ప్రజలు నది దాటకుండా ఉండేందుకు పై అధికారుల ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందిని మోహరించారు.కొండ్రా జుపేట కాజ్వేపై వరద నీరు ప్రవహించడంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.పై అధికారుల ఆదేశాలతో ఏఎస్ఐ సింహాచలం,కానిస్టేబుల్ రాజు అక్కడే ఉండి ప్రజలను నది దాటవద్దని హెచ్చరిస్తున్నారు.

వరి పంటలో తెగుళ్లు పురుగులు నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోండి

గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:- తుఫాను ప్రభావం వల్ల ముంపుకు గురి అయ్యిన వరి పంటలో కాండం కుళ్ళు తెగులు బ్యాక్టీరియల్ ఆకు ఎండు తెగులు ఆశిస్తాయిఅని వీటి నివారణకు రైతులు తీసు కోవాల్సిన పలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాజరాజేశ్వరి రైతులకు సూచించారు. ముందుగా తమ పొలాలలో ఉన్న నీటిని బయటకు పోయేలా చేయాలని మూడు రోజుల్లోపు హెక్సాకోనజోల్ 2 మిల్లీ లీటర్ల మందు ఒక లీటరు నీటికి లేదా వాలిడామైసిన్ 2.5 మిల్లీ లీటర్ల మందు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. అలాగే ముంపుకు గురి అయ్యిన వరి పొలాలలో దోమ తెగులు నివారణకు నీరు తీసేసి వరి దుబ్బుల మొదలు పరిశీలించి పైమెట్రోజిన్ 120 గ్రాములు లేదా డైనోటేఫ్యూరాన్ 80 గ్రాములు ఉద్ధృతి ఎక్కువ ఉంటే ట్రైఫ్లూమె జోపై రిమ్ (పెక్సాలాన్) 94 మిల్లీ లీటర్ల మందును ఎకరం పొలంలో దుబ్బుల మొత్తం తడిచేలా పిచికారి చేసుకోవాలి అని గోకవరం మండల వ్యవసాయ శాఖ అధికారిణి రాజరాజేశ్వరి రైతులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఐఎఫ్ టి యు ఆధ్వర్యంలో వచ్చే నెల 3,4 తేదీల్లో రాష్ట్ర మహాసభలు

- మీడియా సమావేశంలో ఐఎఫ్ టియు జాతీయ నాయకురాలు పి.టాన్యా, రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వర రావు వెల్లడి

రాజమహేంద్రవరం, పెన్ పవర్ , సెప్టెంబర్ 25: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై అంటే యువత, కార్మికులు, మేధావులు రాజకీయ పక్షాలతో ఐక్య పోరాటం చేస్తామని ఐఎఫ్ టియు జాతీయ నాయకురాలు పి.టాన్యా, రాష్ట్ర సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వర రావు వెల్లడించారు. స్థానిక ప్రెస్ క్లబ్లో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్రంలో మోడీ , రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి ప్రజల నెత్తిన అప్పుల భారం మోపుతున్నారని విమర్శించారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు సాధించుకున్న 143 కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం రద్దు చేసి, వాటిని నాలుగు లేబర్ కోడ్ లుగా పార్లమెంట్లో చట్టం చేశారని విమర్శించారు. దాంతో కార్మికులకు హక్కులు హరించుకు పోయాయని, పని దినాలు పెరిగాయని, కనీస వేతనాలు లేవని, కార్పొరేట్ ప్రైవేటు సంస్థలకు కార్మికుల శ్రమ దోపిడీ కి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించేందుకు వచ్చే నెల 3, 4 తేదీల్లో నగరంలో స్థానిక సంహిత డిగ్రీ కళాశాలలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జాతీయ నాయకురాలు పీ టాన్యా మాట్లాడుతూ, దేశంలో గత 70 సంవత్సరాలుగా సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేయడం దారుణం అన్నారు. కార్పొరేట్ శక్తులకు మోడీ దాసోహం అంటున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను వాటికి దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని , అభివృద్ధిని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వాల చర్యలకు వ్యతిరేకంగా కార్మికులు ,మేధావులు ఐక్య పోరాటాలు చేయాలన్నారు. వచ్చే నెల మూడు నాలుగు తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐఎఫ్టియు నాయకులు రాజశేఖర్, సతీషు, అంటే ఏంటి శ్రీనివాసు ,వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

షాపుల లీజుదారులు దీర్ఘకాలిక అద్దెబకాయిలను చెల్లించాలి

కమిషనర్ రాహుల్ మీనా

రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25: నగర పాలక సంస్థ వాణిజ్య సముదాయాలలోని షాపుల లీజుదారులు అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేని యెడల బకాయిదారుల షాపులను సీజ్ చేయడమే కాకుండా చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుం దని కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం నగరపాలక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. దానవాయి పేటలోని మునిసిపల్ కాంప్లెక్స్ ను సందర్శించి అక్కడ గల షాపుల వివరాలు , వాటి ఆదాయ వనరులు మొదలగు అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ప్రస్తుతం మొదటి అంతస్తులో నిర్వహిస్తున్న 12వ వార్డు సచివాలయాన్ని ప్రజల సౌకర్యార్థం క్రిందకు మార్చాలని సూచించారు. పైనున్న హాలును లీజుకిచ్చి ఆదాయ వనరులు పెంపొందించుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా కాంప్లెక్స్ నందలి పారిశుధ్య నిర్వహణ విధానము మెరుగుపరచే విధంగా చూడాలని, సమస్యలు ఉన్నట్లయితే వాటిని పరిష్కరించాలని సూచించారు. నగరంలో ఇతర దుకాణ సముదాయాలను పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేయించాలని అన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో వ్యాపారం చేయు ప్రతి ఒక్క షాపు యజమాని విధిగా ట్రేడ్ లైసెన్సు కలిగియుండాలని పేర్కొన్నారు. నూతనంగా వ్యాపారం ప్రారంభించిన వారు వ్యాపారం చేస్తూ లైసెన్స్ లేని వారు ట్రేడ్ లైసెన్స్ పొందుటకు మీమీ ప్రాంతంలోని శానిటరీ సెక్రటరీ, ఇన్స్పెక్టర్ లేదా సచివాలయ కార్యాలయంలో సంప్రదించి లైసెన్స్ పొందాలని సూచించారు. లేనిపక్షంలో సదరు షాపులకు నోటీసులు జారీ చేసి, సీజ్ చేయుట జరుగుతుందని తెలిపారు. నగరపాలక సంస్థ వాణిజ్య సముదా యాలలోని షాపుల లీజుదారులు బకాయిలు లేకుండా ప్రతి నెల అద్దెలు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని, అట్లు చెల్లించని వారిపై నిబంధనలకు అనుగు ణంగా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎస్ఈ రీటా, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

ఫైర్ ఇంజన్ వెహికల్ తో ప్రయాణం

వై రామవరం, పెన్ పవర్,సెప్టెంబర్ 25: మండలంలోని చింతలపూడి పంచాయతీ కి వెళ్లడానికి కొండ కాలువలు అవరోధంగా ఉండడంతో ఫైర్ ఇంజన్ వెహికల్తో వెళ్లడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. తుఫాన్ ప్రభావంతో గుర్తేడు, వైరామవరం మండలాలలో కొండ కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయని ఆయా కాలవల సమీపంలో ఉన్న సచివాలయం సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. శుక్రవారం చింతలపూడి వెళ్లడానికి పూజారి పాకలు కాలువ ప్రవాహం ఎక్కువ ఉండడంతో ఫైర్ ఇంజన్ వెహికల్తో జరిగిందని తెలిపారు.

వరద ముప్పుపై అప్రమత్తమైన అధికారులు..

- భాస్కర్ కాలనీ వాసులకు ముందస్తు పునరావాస ఏర్పాట్లు
- ఎంపిడిఓ ఆశీర్వాదం

కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 25. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి,శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండల యంత్రాంగం అప్రమత్తమైంది.లోతట్టు ప్రాంతమైన భాస్కర్ కాలనీలో నివసించే ప్రజలకు ఎలాం టి ఇబ్బంది కలగకుండా ముందస్తు గా పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు.ఎంపీడీవో కార్యాల యం వద్ద ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేయడంతో పాటు కరెంటు,ఫ్యాన్ల ఏర్పాట్లను ఎంపీడీ వో ఆశీర్వాదం,డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథం స్వయంగా పర్యవేక్షిస్తు న్నారు.గాలి,వర్షం కారణంగా చెట్టు కొమ్మలు విద్యుత్ లైన్లకు తగలడం తో,ఎన్డీఆర్ఎఫ్ బృందం సహాయం తో ఎంపీడీవో ఆశీర్వాదం వాటిని తొలగించి ప్రమాదాన్ని నివారించా రు.వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వీఆర్వో రాజారావు ఉన్నారు.

తుఫాన్ ప్రభావంతో ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్న పెద్దేరు

వై రామవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25: తుఫాన్ ప్రభావంతో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పెద్దేరు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుందని స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలో ఉన్న పెద్దేరు,కన్నేరు, కొండ కాలువలు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని తెలిపారు. శుక్రవారం ఉదయం నుండి వర్షం లేకపోవడంతో కొండకాలంలోనూ, సెలయేర్లలోనూ ప్రవాహం తగ్గిందని తెలిపారు.

అంధకారంలో రెండు మండలాలు

వై రామవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 18 : గత రెండు రోజుల నుండి విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో కాలం వెలదీస్తున్నామని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో అడ్డతీగల వైరామవరం మండలాలలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు తెలిపారు. గంగవరం 33 కె వీ ఎస్ఎస్ దగ్గర, అడ్డతీగల ఫీడర్33 కెవి బ్రేకర్ కంప్లైంట్ ఉందని, జంపర్లు కలుపుతున్నామని విద్యుత్ సిబ్బంది తెలిపారు.

దీన్‌దయాల్ ఉపాధ్యాయ సేవలు ఆదర్శనీయం

ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించిన బీజేపీ నాయకులు

గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 25: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ప్రముఖుడైన పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుంజం వీర వెంకట సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా బీజేపీ అధ్యక్షులు ఇక బుల్లి కొండల దొర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కేవీవీ సత్యనారాయణరెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కే. వెంకటేశ్వర్లు దొర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సేవకు, సమాజ అభ్యున్నతికి దీన్‌దయాల్ ఉపాధ్యాయ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలోని చివరి వ్యక్తి అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జట్ల అర్జున్, ఉపాధ్యక్షులు కడారి కృష్ణమూర్తి, మల్లేశ్వర సొసైటీ డైరెక్టర్ నర్మాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి లోతా భారతి, బీజేపీ నాయకులు మిరియాల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ షాపుల లైసెన్సుల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

- బెల్ట్ షాపులు, అనధికార రూ.10 వసూలు చేస్తే చర్యలు
- జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీలత

రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25: తూర్పుగోదావరి జిల్లాలో 2026--27 ఎక్సైజ్ పాలసీప్రకారం దేశంలో తయారైన విదేశీ మద్యం విదేశీ మద్యం షాపుల లైసెన్సుల మంజూరుకు ప్రభుత్వం దరఖాస్తుల కోరుతోందని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారి శ్రీలత తెలిపారు. కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ నిబంధనలు 5 ప్రకారం లాటరీ ద్వారా లైసెన్సు దారుల ఎంపిక జరుగుతుందన్నారు.

2024 లో జిల్లాలో 159 లైసెన్స్ షాపులు ఉన్నాయని, వాటిలో 155 షాపులు పునరుద్ధించుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో 4 ఎక్సైజ్ షాపులకు లైసెన్సులు కొత్త గా మంజూరు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నామన్నారు. ఇంతవరకు మద్యం అమ్మకాల ద్వారా జిల్లాలో రూ. 34.75 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. తిరిగి చెల్లించబడని దరఖాస్తు రుసుము వార్షిక పర్మిట్ రూమ్

బిక్కవోలు (మం.), కడియం (మం.)

కొవ్వూరు (మం.) మండపేట రూరల్ (మం.)

షాపులకు లైసెన్సు కాల 01-10-2026 నుండి 30-09-2027వరకు ఉంటుందన్నారు.

ఒక్కొక్క షాపుకు మూడు లక్షల నుంచి ఏడున్నర లక్షల వరకు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుల ఆసక్తి ఉన్న వారు దరఖాస్తుదారులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో 01-10-2026 రాత్రి 12.00 గంటల వరకు దరఖాస్తులు సమర్పించ వచ్చునన్నారు.ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్/హైబ్రిడ్ విధానంలో దరఖాస్తు రుసుము రూ. 3,00,000/- ప్రాసెసింగ్ ఫీజు రూ.1,000/-,

మొత్తం రూ. 3,01,000/- చెల్లించాలన్నారు.దరఖాస్తులను జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం, .రాజమహేంద్రవరం నగరంలోని నార్త్ ఎక్సైజ్ స్టేషన్, సౌత్ ఎక్సైజ్ స్టేషన్,

కోరుకొండ, రంగంపేట, కొవ్వూరు, దేవరపల్లి, నిడదవోలు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ లలో అందించాలన్నారు. ప్రతి షాపుకు కనీసం 4 దరఖాస్తులు అందినప్పుడే ఎంపిక ప్రక్రియ చేపడతామన్నారు. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లయితే, జిల్లా కలెక్టర్ , జిల్లా మేజిస్ట్రేట్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో వచ్చేనెల 5వ తేదీన ఉదయం 8 గంటలకు లాటరీ తీస్తామన్నారు . దరఖాస్తుదారులు హాజరుకాకపోయినా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

దరఖాస్తుదారులు తమ ఆన్లైన్ సిస్టమ్ జనరేటెడ్ తప్పనిసరిగా తీసుకు రావాలన్నారు.

బెల్ట్ షాపులు, రూ.10 వసుళ్ళ పై కఠిన చర్యలు...

నగరంలో బెల్ట్ షాపులు, మద్యం షాపుల్లో అక్రమంగా ఎమ్మార్పీ ధరల కన్నా పది రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందుతున్నాయని అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీలత హెచ్చరించారు. కచ్చితంగా పర్మిటు షాపుల్లోనే మద్యం సేవించే లా చూడాలని, ఓపెన్ డ్రింకింగ్ చేసే వారి పైన, దుకాణం దారుల పైన కూడా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ సమావేశంలో ఏ ఈ ఎస్ శ్రీనివాసరావు, సి ఐ హనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

డి ఎమ్ హెచ్ వో డా పి.కోమలి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబరు 25: ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసీ సిబ్బంది అందిస్తున్న సేవలు అత్యంత కీలకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. కోమలి అన్నారు. ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా ఫార్మసీ అధికారులు, సిబ్బందిని అభినందిం చారు. శుక్రవారం స్థానిక డి ఎమ్ హెచ్ వో కార్యాలయం లో అసోసియేషన్ ప్రతినిధులు కలవడం జరిగింది.ఈ సందర్భంగా డా పి కోమలి మాట్లాడుతూ, అత్యవసర ప్రాణరక్షక మందులు, టీకాలను నిర్దేశిత ఉష్ణోగ్రతల్లో భద్రపరచడంతో పాటు మందుల నిల్వలను నిరంతరం పర్యవేక్షిస్తూ, మందుల కొరత లేకుండా చూడటంలో ఫార్మసీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గడువు తీరిన, నాసిరకం మందులను గుర్తించి సురక్షితంగా తొలగించడం ద్వారా రోగుల భద్రతకు భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు.డాక్టర్లు సూచించిన మందులను నిర్ణీత సమయానికి, సరైన మోతాదులో వినియో గించేలా రోగులకు అవగాహన కల్పించడం, వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వినియోగించకుండా ప్రజలను చైతన్యపరచడం ఫార్మసిస్టుల బాధ్యతల్లో ముఖ్యమైనవని డాక్టర్ కోమలి తెలిపారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా ప్రోత్సహించడంతో పాటు, యాంటీబయాటిక్స్ దుర్వినియోగాన్ని అరికట్టడంలోనూ ఫార్మసిస్టులు చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. జిల్లా ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు అహర్నిశలు సేవలందిస్తున్న ఫార్మసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిని కలిసిన ఫార్మసీ అధికారులు సత్యనారాయణ, రాజేశ్, జైలుద్దీన్, మూర్తి, పాపారాయుడు తదితరులు ఉన్నారు.

అంగన్వాడీ ఉత్సవం ప్రారంభ

- గోరగొమ్మిలో అంగన్వాడీ ఉత్సవం ప్రారంభం
- పోషణ్ మహా కార్యక్రమంతో పాటు అంగన్వాడీ ఉత్సవానికి శ్రీకారం

గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో గంగవరం సెక్టార్ పరిధిలోని గోరగొమ్మి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్వాడీ ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీడీపీవో వి. సుచరిత ఆదిలక్ష్మి ఆధ్వర్యం వహించారు. అంగన్వాడీ ఉత్సవం సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందుతున్న పోషకాహారం, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, ఆట వస్తువులు, రహదారి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆహార పదార్థాలతో పాటు అవసరమైన సౌకర్యాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేవీవీవీవీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ఆరోగ్య, విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రాలకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఆట వస్తువులు, రహదారులు తదితర సౌకర్యాల కోసం తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం బీజేపీ నాయకులు అంగన్వాడీ సూపర్వైజర్ కే. కుమారి, అంగన్వాడీ కార్యకర్త కేవీవీ రాఘవమ్మ, ఆయా ఎల్. లలితలను సన్మానించారు. అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి లోతా భారతి, రాష్ట్ర మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు కుంజం సత్యనారాయణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, జిల్లా యువ మోర్చా నాయకులు మిరియాల దొరబాబు, మండల ప్రధాన కార్యదర్శి జట్ల అర్జున్, మండల ఉపాధ్యక్షులు కడారి కృష్ణమూర్తి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ నరమల శ్రీనివాసరావు, సెక్టార్ సూపర్వైజర్ కే. కుమారి, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ఏకాత్మాత మానవతా, అంత్యోదయ సిద్ధాంతం తో జనంలో జీవించి ఉన్న దీన్ దయాళ్

తాడేపల్లిగూడెం, పెన్ పవర్. సెప్టెంబర్ 25, ఏకాత్మాత మానవతా,అంత్యోదయ సిద్ధాంతం తో.. ప్రజల్లో జీవించే ఉన్నారని బిజెపి రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి భోగిరెడ్డి ఆదిలక్ష్మి అన్నారు. కొందరు మరణించేవరకు జీవిస్తారని, మహనీయులు మరణించిన తరువాత కూడా జీవించే ఉంటారని, అటువంటి కోవకు చెందిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శనీయులని ఆమె నివాళులు అర్పించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం బిజెపి తాడేపల్లిగూడెం పట్ట కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దువ్వా శ్రీను అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఆదిలక్ష్మి మాట్లాడుతూ దీన్ దయాళ్ ను అందరూ స్ఫూర్తి గా తీసుకోవాలని కోరారు. యువమోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింధు పైడికొండల మాట్లాడుతూ ఏకత్మాత మానవతా సిద్ధాంతం తో గాంధీజీ సోషలిజం సమ్మిళితం చేసి భారతీయ జన సంఘ్ ను ప్రజలకు చేరువ చేశారని కొనియాడారు. అధ్యక్షులు దువ్వా శ్రీను మాట్లాడుతూ ఏకా త్మత మానవతా సిద్ధాంతం తో భారతీయ జనసంఘ్ ను ప్రజలకు చేరువ చేసిన మహనీయుడు దీన్ దయాళ్ అని నివాళులు అర్పించారు. ప్రధాని సేవా రజతోత్సవాల లో భాగంగా దీన్ దయాల్ ప్రవేశపెట్టిన అంత్యోదయ ను ప్రజలందరికి చేరువచేసేందుకు అందరూ కృషిచేయాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లోరాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాష్ట్రం కంచుమర్తి నాగేశ్వరరావు మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు గోకా మహాలక్ష్మి,మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు తాడాల సూర్యకుమారి, పట్టణ ప్రధాన కార్యదర్శి పడాల కావ్యరెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు రామగాని సత్యనారాయణ, కార్యదర్శి కసిరెడ్డి నాగదుర్గ, చిన్నా, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి తుట్టగుంట కృష్ణకుమారి, కిసాన్ మోర్చా నేత చెరుకూరి గంగాధర్, మోటూరి వెంకటరత్నం తదితరులు పాల్గొని దీన్ దయాళ్ కు నివాళులు అర్పించారు.

శబరి బ్రిడ్జి వద్ద నీటి మట్టం పరిశీలించిన జేసీ ప్రశాంత్ కుమార్...

ముంపు ముప్పుపై అధికారులు సిద్ధంగా ఉండాలి

కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 25. పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ కూనవరం మండలం శబరి బ్రిడ్జి వద్ద గోదావరి,శబరి నది నీటి మట్టాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్,చింతూరు ఐటీడీఏ పిఓ శుభం నొక్వల్ శుక్రవారం పరిశీలించారు. వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో తదుపరి తలెత్తబోయే పరిస్థితులు, ముంపు ముప్పుపై అధికారులను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతా ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు,పునరావాస కేంద్రా ల ఏర్పాటుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి వద్ద అధికారులు, స్థానికులతో మాట్లాడిన జేసీ,వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కల గకుండా చూడాలని సూచించారు.

కొత్తపల్లి ఎంపీటీసీ స్థానం ఖాళీ - 6 నెలల్లో బై ఎలక్షన్ పెట్టాల్సిన అధికారుల నిర్లక్ష్యం...

- ప్రజాధనంతో అర్హత లేని వ్యక్తికి సత్కారం..
- సెక్షన్ 14(4) పట్ల ఇంత నిర్లక్ష్యం ఏంటి...

గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:- గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు 2025 లో మృతి చెందారు. నాటి నుండి ఈరోజు 2026 సెప్టెంబర్ 24 వరకు ఉన్న సమయం గడిచినా ఆ స్థానంలో ఉప ఎన్నిక (బై ఎలక్షన్) పెట్టలేదు. పెట్టకపోవడం సరిగదా, నిన్న (గురువారం) మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వీడ్కోలు సభలో ఆ మృతి చెందిన ఎంపీటీసీ భర్తను తీసుకొచ్చి అధికారికంగా ప్రజాధనంతో పౌర సన్మానం చేయడం వివాదాస్పదమైంది.

పంచాయతీరాజ్ చట్టం 1994, సెక్షన్ 14 (4) ఏం చెబుతుంది..?

ఏదైనా ఎంపీటీసీ స్థానం ఖాళీ అయిన తేదీ నుండి 6 నెలల లోపు ఆ ఖాళీని ఉప ఎన్నిక ద్వారా భర్తీ చేయాలి.కాని గోకవరం మండల అధికారులు మాత్రం ఈ చట్టానికి భిన్నంగా వ్యవహరిస్తారు ఎందుకంటే ఎవరో కూడా ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం తో వీరు ఏది చేసినా చెల్లుబాటు అవుతుంది అనే విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు మీరు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.కొత్తపల్లి ఎంపీటీసీ 2025 చనిపోయారు కాబట్టి ఆరు నెలల వ్యవధి దాటకుండగానే బై ఎలక్షన్కు పిలవాలి లేదు ఆరు నెలలు దాటిన తర్వాత అయినా ఎలక్షన్ నిర్వహించాలి దీనికి సంబంధించి కూడా ఎంపీడీవో డిఎల్పిఓ జిల్లా కలెక్టర్ ద్వారా ఎలక్షన్ కమిషన్ పంపించాలి మరి అలా పంపించారో లేదో తెలియదు ఎంతకాలమైనా బై ఎలక్షన్ జరగలేదు పుణ్యకాలం కాస్త పూర్తయిపోయింది చనిపోయిన ఎంపిటిసి భర్తను అధికారికంగా సన్మానించడంపై సర్వత్ర ఇప్పుడు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బై ఎలక్షన్ జరగాలి కానీ జరగలేదు. ఇది ముమ్మాటికీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జిల్లా పంచాయతీ అధికారి జిల్లా కలెక్టర్ (జిల్లా ఎన్నికల అధికారి) ల పూర్తి నిర్లక్ష్యం గానే చట్ట పరిధిలో పరిగణలోనికి తీసుకుంటారు చట్టాన్ని ధిక్కరించినట్లే అయ్యింది.

ఆమె చనిపోయిన నాటికి పదవీ కాలం ముగియడానికి దాదాపు చాలా వ్యత్యాసం ఉంది. కాబట్టి పదవీ కాలం తక్కువ ఉంది అనే మినహాయింపు కూడా వర్తించదు.

కొన్ని నెలలు ప్రజలకు ప్రతినిధి లేదు..ఇప్పుడు భర్తకు సన్మానమెంటి...?

కొన్ని నెలలుగా కొత్తపల్లి ప్రజలకు మండల పరిషత్ లో గొంతు లేకుండా చేసి, వారిని అవమానపరచిన అధికారులు ఇప్పుడు ప్రజాధనంతో జీవో లకు విరుద్ధంగా ఏ పదవీ లేని ఆమె భర్తకు సన్మానం చేయడం ప్రోటోకాల్ ఉల్లంఘన, ప్రజాధనం దుర్వినియోగం.పంచాయతీరాజ్ చట్టం 1994, సెక్షన్ 14(4) ని ఉల్లంఘించి కొన్ని నెలలుగా బై ఎలక్షన్ పెట్టకుండా నిర్లక్ష్యం వహించిన అధికారులపై,మరియు ప్రోటోకాల్ ఉల్లంఘించి ప్రైవేట్ వ్యక్తికి సన్మానం చేసిన అధికారు లపై జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణం చర్యలు తీసుకోవాలని, సన్మానానికి పెట్టిన ఖర్చును వారి నుండి రికవరీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వరద ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు...

ప్రజల ఆరోగ్యానికి భరోసా

కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 25. వరదల నేపథ్యంలో ప్రజల ఆరోగ్యా నికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా కూనవరం మండల అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాళ్ళగూడెం,బొజ్జరా యిగూడెం గ్రామాల్లో డా శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. శిబిరా ల్లో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందుల ను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి,తాగునీటి భద్రత గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది గ్రామస్థ లకు వివరించారు. ఆరోగ్య సమస్య లు తలెత్తిన వెంటనే సమీప ప్రభు త్వ ఆసుపత్రులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం బి.రాజమ్మ,హెల్త్ అసిస్టెంట్ కె.రాము,ఆశా కార్యకర్త బి. శారద,అంగన్వాడి కార్యకర్త బి.రేణుక తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు...

అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 25;అడ్డతీగల మండల వ్యాప్తంగా గత రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని ఏలేరు వాగు, పింజరికొండ వాగులను పరిశీలించగా నీటి ప్రవాహం అత్యంత ఉధృతంగా ఉన్నట్లు అడ్డతీగల ఎంపీడీవో ఏ.వి.కుమార్ తెలిపారు. వర్ష ప్రభావం తీవ్రంగా ఉన్నందున ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా, నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో సూచించారు. మరోవైపు తుంగమడుగుల సచివాలయం సమీపంలో భారీ వృక్షం కూలిన విషయం గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ పి.సుదర్శన్ను మండలంలో పర్యవేక్షిస్తున్నారు.ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని ఆయన వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

భారీ వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు...

అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 25;అడ్డతీగల మండల వ్యాప్తంగా గత రెండు, మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలోని ఏలేరు వాగు, పింజరికొండ వాగులను పరిశీలించగా నీటి ప్రవాహం అత్యంత ఉధృతంగా ఉన్నట్లు అడ్డతీగల ఎంపీడీవో ఏ.వి.కుమార్ తెలిపారు. వర్ష ప్రభావం తీవ్రంగా ఉన్నందున ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా, నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో సూచించారు. మరోవైపు తుంగమడుగుల సచివాలయం సమీపంలో భారీ వృక్షం కూలిన విషయం గుర్తించిన అధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ పి.సుదర్శన్ను మండలంలో పర్యవేక్షిస్తున్నారు.ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేదని ఆయన వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

రోబోటిక్, ఫ్లోరోసెన్స్ సాంకేతికలతో క్యాన్సర్ చికిత్స

మీడియా సమావేశంలో యశోద హైటెక్ సిటీ క్యాన్సర్ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:క్యాన్సర్ చికిత్సలో వస్తున్న సాంకేతిక విప్లవం రోగుల పాలిట వరంగా మారుతోంది. కేవలం వ్యాధిని తొలగించడమే కాకుండా, శరీర భాగాలకు నష్టం వాటిల్లకుండా సురక్షితమైన ఆపరేషన్లు చేయడం ఆధునిక రోబోటిక్, ఫ్లోరోసెన్స్ శస్త్రచికిత్సలతోనే సాధ్యమవుతోందని యశోద హైటెక్ సిటీ క్లినికల్ డైరెక్టర్, సర్జికల్ ఆంకాలజీ నిపుణులు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి తెలిపారు. త్రీడీ హై-డెఫినిషన్ వీక్షణ, కృత్రిమ మేధస్సు సాయంతో రోబోటిక్ యంత్రం తో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లను సైతం పూర్తి చేస్తున్నాయన్నారు. చిన్న రంధ్రాల ద్వారా చేసే అధునాతన సర్జరీల వల్ల రోగులకు నొప్పి, మచ్చలు, రక్తస్రావం తీవ్రత తగ్గుతుందన్నారు. ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై స్థానికంగా జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ, మహిళల్లో వచ్చే గర్భాశయ, అండాశయ, రొమ్ము క్యాన్సర్లకు ఈ విధానం అత్యుత్తమ పరిష్కారం చూపుతోందని స్పష్టం చేశారు. ఫ్లోరోసెన్స్ సాంకేతికత ద్వారా ప్రత్యేక రంగును శరీరంలోకి పంపి వ్యాధి కణాలను గుర్తించి తొలగించవచ్చన్నారు. ప్రోస్టేట్, మూత్రాశయ, కిడ్నీ క్యాన్సర్లలో సున్నితమైన నాడులను, లైంగిక తత్వాన్ని కాపాడుతూ, మూత్ర నియంత్రణకు భంగం కలగకుండా శస్త్రచికిత్సలు చేయడం సులభతర మైందన్నారు. కోలోరెక్టల్ క్యాన్సర్ల, ఊపిరితిత్తుల ఆపరేషన్లను సైతం చిన్న రంధ్రాలతోనే సురక్షితంగా పూర్తి చేస్తున్నారన్నారు. 'ఫైర్‌ఫ్లై' ఇమేజింగ్ టెక్నాలజీతో క్యాన్సర్ కణాలు కెమెరాలో స్పష్టంగా కనిపించడం వల్ల, వాటిని కచ్చితత్వంతో ఏరివేయడం సాధ్యమ వుతోందన్నారు. తక్కువ రోజుల్లోనే డిశ్చార్జ్ అవ్వడం, వెంటనే పనుల్లోకి వెళ్లడం ప్రయోజనాలు రోగులు చేసుకో వచ్చునన్నయన్నారు. ఈ సమావేశంలో ఆంకాలజీ మేనేజర్ సాయి వెంకట్ మద్దు పాల్గొన్నారు.

బిజెపి సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయమానవతవాది

రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25:బిజెపి సిద్ధాంతకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు తూర్పు గోదావరి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో శుక్ర వారం ఘనంగా జరిగాయి.ఏకాత్మతా,మానవతావాద నినాదంతో జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పండిట్ దీన దయాళ్ ని అన్ని వర్గాలు స్మరించుకోవాలన్నారు. దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. రాష్ట్ర ఒబిసి మోర్చా అధ్యక్షులు రొంగల గోపీ శ్రీనివాస్ స్మారక ఉపన్యాసం ఇచ్చారు. విలువలకు కట్టుబడి "భారతీయ జనతా పార్టీ" కి సైద్ధాంతిక మార్గదర్శి, పండిట్ దీన్ దయాళ్ అని 'అంత్యోదయ' సిద్ధాంతం తో సమాజనికి సంక్షేమం అందాలనే ఆశయంతో జీవితాన్ని అంకితం చేశారని కీర్తించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సిపల్లి హారిక, కురగంటి సతీష్ ,యానాపు యేసు , బేతి రెడ్డి ఆదిత్య ,డాక్టర్ కవికొండల శ్రీనివాస్, కోడూరి లక్ష్మీనారాయణ ,తగరం సురేష్ , పెరుమాళ్ళ పవన్ కుమార్, అధికార లక్ష్మి ,దేవి ,గీత భాగ్యలక్ష్మి ,రాము , కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దేశ ద్రోహ వ్యాఖ్యలపై బీజేపీ ఆద్వర్యం లో నిరసన

రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 25: భారత ఎన్నికల కమిషనర్ ను, భారత ప్రధాని నరేంద్ర మోదీ ను, హోమ్ మంత్రి అమిత్ షా ను దేశ ద్రోహులు గా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో బిజెపి నాయకులు కార్యకర్తలు శుక్రవారం నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ.. భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచ అగ్ర దేశాలతో ధీటుగా అభివృద్ధి చెందుతూన్నారు . వికసిత భారత్ లక్ష్య సాధన దిశగా నరేంద్ర మోదీ, అమిత్ షా సంకల్పంతో కృషి చేస్తున్నారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ, సర్ ద్వారా దొంగ ఓట్లను తొలగిస్తూ, దేశంలోకి వచ్చిన విదేశీ అక్రమ చొరబాటు దారుల ఓట్లను తొలగించే ప్రక్రియను చేపట్టిన స్వతంత్రత భారత ఎన్నికల కమిషన్ ను తప్పుపడుతూ ఎన్నికల కమిషనర్ ని రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

దేశం లో అరాచకాలు సృష్టించడానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు ఉందన్నారు.

ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి తప్పకుండా తగిన బుద్ధి చెబుతారని పిక్కి నాగేంద్ర అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రోంగల గోపి శ్రీనివాస్, కురగంటి సతీష్, యానాపు యేసు, కందికొండ రమేష్, కాలేవు సాయి రామ్, మట్టాడి వెంకట రమణ, తనుబుద్ధి భాస్కర్, పాతూరి రవిశంకర్, చిక్కాల మోహిని, బండి సత్య ప్రసాద్, స్వామి సూర్య కిరణ్, పెరుమాళ్ళ పవన్, పాలడుగుల శ్రీవిద్య, తగరం సురేష్, పేపకాయల కాశీ, బిజెపి క్యాడర్ పాల్గొన్నారు.

దువ్వలో వెంకయ్య కాలువను, నందమూరిలో తుఫాను పరిస్థితులపై కాలువలు, డ్రైన్లను పరిశీలించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.

తుఫాను పరిస్థితులపై ఎమ్మెల్యే బొలిశెట్టి రెండో రోజు పర్యటన.

తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 25:తుఫాను ప్రభావంతో నందమూరి గ్రామ పరిధిలో నెలకొన్న పరిస్థితులను రెండో రోజు కూడా తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు.నందమూరి పరిధిలోని ఎర్ర కాలువ ఆక్వాడక్ట్‌ను పరిశీలించి, కాలువలో నీటి ప్రవాహం, పరిస్థితులను అధికారులను రైతు లను అడిగి తెలుసుకున్నారు.పెంటపాడు మండలం వెస్ట్ విప్పర్రు గ్రామంలోని డ్రైన్‌ను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. వర్షపు నీరు పొలాల్లోకి చేరి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, డ్రైన్లలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.దువ్వ గ్రామంలోని వెంకయ్య కాలువను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో కాలువల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని, కాలువలు, డ్రైన్లలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తగిన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈనెల 1 న ఇవ్వాల్సిన పెన్షన్లు అదేరోజు మధ్యాహ్నం ఇస్తాం ఎంపీడీవో గోవింద్.

గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 25:- ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీ గోకవరం మండలంలోని ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ఒకటో తేదీ మధ్యాహ్నం పంపిణీ చేయడం జరుగుతుందని గోకవరం ఎంపీడీవో ఎం గోవిందు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ బ్యాంక్ యూనియన్ల సమ్మె (28 నుండి 30 సెప్టెంబర్ 2026 వరకు) నేపథ్యంలో, సెప్టెంబర్ 2026 నెలకు సంబంధించిన పించన్ల నగదు డ్రాను అక్టోబర్ 1, 2026 ఉదయం పూట నిర్వహించి, అదే రోజు అనగా అక్టోబర్ 1, 2026 మధ్యాహ్నం 12:00 గంటల నుండి పించన్ల పంపిణీ ప్రారంభించబడుతుంది.కావున, గోకవరం మండల పరిధిలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేందుకు,ఈ సవరించిన సమయంపై లబ్ధిదారులందరూ తగిన అవగాహన కలిగి ఉండాలని కోరడమైనది. అదేవిధంగా వివిధ గ్రామాలలోని అందరూ ఈ ప్రకటన గమనించి వృద్ధులకు వివరించి చెప్పి వారు ఆందోళన చెందకుండా చూడాలని కోరుతూ ఇది కేవలం సమయం మాత్రమే మార్పు జరిగిందని ఉదయం ఇవ్వాల్సిన ఫంక్షన్లో మధ్యాహ్నం సమయంలో ఇవ్వడం జరుగుతుందని ఈ మార్పు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సెర్ఫ్ విజయవాడ వారి ఆదేశాల ప్రకారం జరుగుతుందని ఆయన తెలిపారు.

డొంకరాయి డ్యాం నుండి నీరు విడుదల

వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్,సెప్టెంబర్ 25: గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు డొంకరాయి జలాశయం నుండి నాలుగు గేట్లనే ఎత్తి నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నట్లు జెన్కో సిబ్బంది తెలిపారు. లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టులో నీటి నిల్వ 1037 అడుగులు కాగా ప్రస్తుతం ఎగవ ప్రాంతం నుండి వస్తున్న నీరు 1027 అడుగులకు చేరిందని దీని కారణంగా డొంకరాయి పవర్ ప్రాజెక్ట్ నుండి నాలుగు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. డ్యాం దిగనున్న ప్రజల అప్రమతంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు.

కొత్తూరు సెంటర్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద దసరా నవరాత్రులకు రాట ముహూర్తం

ఆలమూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 25:దసరా నవరాత్రుల సందర్భంగా జరిగే వేడుకల కోసం కొత్తూరు సెంటర్ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శు క్రవారం రాట ముహూర్తం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రాట పాతి ఆలయ అర్చకులు పెద్దింటి హనుమాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్టోబర్ 11వ తేదీ నుంచి అమ్మవారి ఆలయం వద్ద శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతాయని వారు తెలియజేసారు.

తుఫాన్ బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించి తక్షణమే ఆదుకోవాలి.

-రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల డిమాండ్.

కిర్లంపూడి, పెన్ పవర్, సెప్టెంబర్, 25:గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు వల్ల పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి తక్షణ ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ణాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమరాయణం పేట-బూరుగుపూడి మధ్యలో ఉన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇటు వరదలు వచ్చి రైతన్నలు నష్టాల పాలవుతున్నారన్నారు. బ్యాంకుల్లో అప్పులు చేసి, బయట అధిక మొత్తంలో వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు పెట్టారన్నారు.ఇప్పుడు అకాల వర్షాల కారణంగా పంటలు మొత్తం మునిగిపోయి,అయోమయ పరిస్థితిలో రైతులు ఉన్నారన్నారు.తక్షణమే పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి, రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

ఆసియా క్రీడల్లో గుల్వీర్ సింగ్ సత్తా.. 10,000 మీటర్లలో సిల్వర్ మెడల్!



హైదరాబాద్ పెన్ పవర్: భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్ మరోసారి తన సత్తా ఏంటో ప్రపంచానికి చాటి చెప్పారు. 2026 ఆసియా క్రీడలలో పురుషుల 10,000 మీటర్ల ఫైనల్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ హోరాహోరీ రేసును ఆయన కేవలం 28:29.38 నిమిషాల టైమింగ్‌తో పూర్తి చేసి ట్రెండింగ్‌లో నిలిచారు.

గుల్వీర్ సక్సెస్ జర్నీ:

అంతర్జాతీయ వేదికలపై గుల్వీర్ సింగ్ తన పరుగుతో తిరుగులేదని నిరూపిస్తున్నారు. ఈ తాజా గెలుపుతో ఆయన తన కెరీర్‌లో మరో భారీ అంతర్జాతీయ పతకాన్ని జమ చేసుకున్నారు. సరిగ్గా చెప్పాలంటే, గతంలో 2023లో జరిగిన హాంగ్జౌ ఏషియన్ గేమ్స్‌లోనూ అతడు కాంస్య పతకం సాధించి అదరగొట్టారు.

గుల్వీర్ సింగ్ పతకాలు:

ఇటీవలే ముగిసిన 2026 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ గుల్వీర్ అదరగొట్టారు. అక్కడ 27:49.78 సమయంలో రేసును పూర్తి చేసి రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఇక రికార్డుల విషయానికి వస్తే.. 2025లో ఏకంగా 27:00.22 సమయంలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ 10,000 మీటర్ల రికార్డును తన పేరిట లిఖించుకున్నారు. అంతకంటే ముందు గత ఏడాదే ఏషియన్ టైటిల్‌ను కూడా కైవసం చేసుకున్నారు. దీంతో ఆసియా ఖండంలోనే టాప్ డిస్టెన్స్ రన్నర్లలో ఒకరిగా తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు.

ఇండియన్ అథ్లెటిక్స్ గర్వించదగ్గ స్టార్:

అంతర్జాతీయ గేమ్స్ లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుల్వీర్ సింగ్, ఈ ఆసియా క్రీడలలోనూ తన సూపర్ ఫామ్‌ను కంటిన్యూ చేశారు. ఈ తాజా పోడియం ఫినిష్‌తో అతడు అంతర్జాతీయ వేదికలపై భారత్ కీర్తిని మరో మెట్టు ఎక్కించారు.

భారత్ 2027 వరల్డ్ కప్ ప్లాన్ ఇదేనా? రోహిత్, కోహ్లీపై గంభీర్ వ్యాఖ్యలు వైరల్!

హైదరాబాద్ పెన్ పవర్: వెస్టిండీస్‌తో త్వరలో జరగనున్న 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల రూపంలో అత్యంత అనుభవజ్ఞులైన ఆటగాళ్ల అండ లభిస్తోందని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పేర్కొన్నారు. గతేడాది వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన గిల్ నాయకత్వానికి ఈ సీనియర్ల అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

గంభీర్ ప్రశంసలు – కోహ్లీ, రోహిత్ పాత్ర:

జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కోచ్ గంభీర్ మాట్లాడుతూ.. వన్డే క్రికెట్‌లో రోహిత్, విరాట్ లాంటి దిగ్గజాలు మైదానంలోనూ, మైదానం బయట గిల్‌కు సహాయపడే స్థితిలో ఉండటం అతడు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. ముఖ్యంగా యువ వయసులో ఉద్వేగాలకు లోనయ్యే ఛాన్స్ ఉంటుందని, కానీ గిల్ భావోద్వేగాలను పక్కన పెట్టి ప్రశాంతంగా వ్యవహరిస్తున్నాడని గౌతమ్ గంభీర్ కొనియాడారు.

గిల్ లీడర్‌షిప్ స్టైల్ పై కోచ్ అంచనాలు:

26 ఏళ్ల శుభ్‌మన్ గిల్ తన నాయకత్వ లక్షణాలతో అన్ని విభాగాల్లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడని గౌతమ్ గంభీర్ ప్రశంసించారు. గిల్ ఎంతో ప్రశాంతంగా, నిస్వార్థంగా, దూకుడుగా వ్యవహరిస్తూ కేవలం పరుగులతోనే కాకుండా తన ఆచరణ ద్వారా జట్టుకు ఆదర్శంగా నిలుస్తున్నాడని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌లో గిల్‌కు ఇటీవలి కాలంలో కొంత కష్టకాలం ఎదురైనప్పటికీ, అతడు సరైన మార్గంలోనే పయనిస్తున్నందున త్వరలోనే మెరుగైన ఫలితాలు వస్తాయని గంభీర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్ వర్సెస్ వెస్టిండీస్ సిరీస్ షెడ్యూల్:

ఈ సిరీస్‌లో భాగంగా తొలి వన్డే సెప్టెంబర్ 27వ తేదీన తిరువనంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనుంది. రెండో వన్డే సెప్టెంబర్ 30న గువహటిలోనూ, మూడో వన్డే అక్టోబర్ 3న న్యూ చండీగఢ్‌లోనూ నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆ తర్వాత ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుండగా, అది అక్టోబర్ 17వ తేదీన బెంగళూరులో ముగుస్తుంది. ఈ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలతో పాటు వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ కూడా కొనసాగుతున్నారు.

వెస్టిండీస్‌పై గిల్ అద్భుత రికార్డు:

వెస్టిండీస్ జట్టుపై శుభ్‌మన్ గిల్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. విండీస్‌పై ఇప్పటి వరకు 6 వన్డే మ్యాచ్‌లు ఆడిన గిల్ 66.2 సగటుతో, 92.71 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 331 పరుగులు సాధించారు. ఇందులో అతని అత్యధిక వ్యక్తిగత స్కోరు 98 పరుగులు.. సీనియర్ ఆటగాళ్ల అనుభవాన్ని అందిపుచ్చుకుంటూ గిల్ తన కెప్టెన్సీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించనున్నారు.

66 -- 28తో థాయ్‌లాండ్ చిత్తు.. ఆసియా గేమ్స్ కబడ్డీ ఫైనల్‌లోకి టీమిండియా!

హైదరాబాద్ పెన్ పవర్: పాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలు కబడ్డీ టోర్నమెంట్‌లో భారత పురుషుల జట్టు కిరాక్ ప్రదర్శనతో చెలరేగింది. టోకై సిటిజన్స్ జిమ్నాసియంలో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 66--28 తేడాతో థాయిలాండ్‌ను చిత్తు చేసి ఫైనల్‌లోకి దూసుకెళ్లింది.

ఆరంభం నుంచే ఆధిపత్యం:

గ్రూప్-ఏ లో అన్ని మ్యాచ్‌లు గెలిచి అగ్రస్థానంతో సెమీస్‌లోకి అడుగుపెట్టిన భారత జట్టు, నాకౌట్ దశలో ఎలాంటి తడబాటు లేకుండా ఆడింది. ఇండియన్ డిఫెన్స్ విభాగంలో జైదీప్ దహియా, సుమిత్, రాహుల్ సేథ్‌పాల్, కెప్టెన్ సునీల్ కుమార్ అద్భుతంగా ఆడాడు. ఎనిమిది సార్లు ఆసియా క్రీడల కబడ్డీ చాంపియన్‌గా నిలిచిన భారత్, మ్యాచ్ ప్రారంభమైన మొదటి 5 నిమిషాల వ్యవధిలోనే థాయిలాండ్‌ను తొలిసారి ఆల్‌ఔట్ చేసి పూర్తి ఆధిక్యాన్ని సంపాదించింది.

థాయిలాండ్ ప్రతిఘటన – భారత రెయిడర్ల జోరు:

మొదటి ఎదురుదెబ్బ నుంచి థాయిలాండ్ జట్టు మెల్లగా కోలుకుంది. థాయిలాండ్ ప్లేయర్ ధీరడెట్ చైసిత్ కొన్ని సంచనాత్మక సూపర్ రెయిడ్స్‌తో పాటు వరుస సక్సెస్‌ఫుల్ రెయిడ్స్‌తో విరుచుకుపడ్డాడు. ఆశ్చర్యకరంగా భారత్‌ను ఆల్- ఔట్ చేసి స్కోరును 24-14 కు తగ్గించాడు. కానీ, భారత రెయిడర్ దేవంక్ దలాల్ అద్భుతమైన ప్రదర్శనతో విజృంభించారు. మొదటి హాఫ్ ముగిసేసరికి భారత్ 37--18 ఆధిక్యంలో నిలిచింది.

సెకండ్ హాఫ్ లోనూ తగ్గని జోరు:

రెండో అర్ధభాగంలోనూ మ్యాచ్‌పై భారత జట్టు పూర్తి నియంత్రణ సాధించింది. థాయిలాండ్ తరఫున చైసిత్ ఒంటరి పోరాటం చేసినప్పటికీ, టీమిండియా వ్యూహాత్మకంగా ఆడుతూ మరో రెండుసార్లు థాయిలాండ్‌ను ఆల్- ఔట్ చేసింది. చివరికి 66-28 భారీ స్కోరుతో ఘన విజయం సాధించి ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది.

స్వర్ణ పతక పోరుకు సర్వం సిద్ధం:

(సెప్టెంబర్ 26, శనివారం) జరిగే ఏషియన్ గేమ్స్ 2026 కబడ్డీ స్వర్ణ పతక పోరులో భారత్.. ఇరాన్, చైనీస్ తైపీ జట్ల మధ్య జరిగే మరో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. ఆసియా

క్రీడల కబడ్డీ చరిత్రలో 1--0 తో ఎడిషన్లలో ఇండియా ఫైనల్ చేరడం ఇది తొమ్మిదోసారి కావడం విశేషం. కాగా, 2018 జకార్తా గేమ్స్‌లో కాంస్యంతో సరిపెట్టుకోవడం మినహా ప్రతీసారి భారత్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో కాంస్య పతక పోరు ఉండదని, సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లు పోడియం స్థానాలను దక్కించుకుంటాయని నిర్వాహకులు తెలిపారు.

నిఖిల్- తేజ అన్నదమ్ముల్లా ఒకే మార్గంలో!

టాలీవుడ్‌లో సరికొత్త కంటెంట్‌తో పాన్ -ఇండియా స్థాయిలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోలు నిఖిల్ సిద్ధార్థ్, తేజా సజ్జా. వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకుంటూ కాన్సెప్ట్ ఆధారిత చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడంలో ఇద్దరి శైలి ఒకేలా కనిపిస్తుంది. వినూత్న ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తూ, ఒకే రకమైన విజన్‌తో ప్రయాణిస్తున్న ఇద్దరు నటులు పరిశ్రమలో అన్నదమ్ముల్లా ఒకే బాటలో పయనిస్తున్నారనే అభిప్రాయం విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది.

-కార్తికేయ 2- చిత్రంతో జాతీయ స్థాయిలో అద్భుత విజయాన్ని అందుకున్న నిఖిల్ తదుపరి ప్రాజెక్ట్‌లను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రయోగాత్మక కథలను ఎంచుకుంటూనే సాంస్కృతిక, చారిత్రక అంశాలకు ప్రాధాన్యమిచ్చే భారీ చిత్రాలలో నటిస్తున్నారు. ఆయన లైనప్‌లో ప్రస్తుతం -స్వయంభూ- పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటోంది. వీటితో పాటు చారిత్రక ప్రాధాన్యత ఉన్న -ది ఇండియా హౌస్- అనే మరో పాన్ -ఇండియా చిత్రం లైన్లో ఉంది. తిరుగులేని బ్లాక్‌బస్టర్ అందించిన ఫ్రాంచైజీలో రాబోతున్న -కార్తికేయ 3- పనులు జరుగుతున్నాయి.

మరోవైపు చైల్డ్ ఆర్టిస్ట్‌గా పరిశ్రమలోకి వచ్చి -హను-మాన్- చిత్రంతో పాన్ ఇండియాలో క్రేజ్ సంపాదించుకున్నారు తేజా సజ్జా. ఫాంటసీ, మైథాలజీ, గ్రాఫికల్ విజువల్స్‌తో కూడిన కథలను నమ్ముకుంటూ తనకంటూ ప్రత్యేక మార్గాన్ని సుగమం చేసుకున్నారు. ప్రస్తుతం తేజ నటిస్తోన్న -మిరాయి2- చిత్రం సూపర్ హీరో యాక్షన్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతుండగా .. -జాంబీ రెడ్డి- సీక్వెల్ గా -జాంబీ రెడ్డి 2- పనులు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి.

ఇలా ఇద్దరి లైనప్‌లను గమనిస్తే కొన్ని ఆసక్తికరమైన సమానత్వాలు కనిపిస్తాయి. ఇద్దరూ రొటీన్ కమర్షియల్ ఫార్మాట్లకు దూరంగా ఉంటున్నారు. విజువల్స్‌కు ప్రాధాన్యత ఉన్న కాన్సెప్ట్‌లకే జై కొడుతున్నారు. ఒకరికి కార్తికేయ సిరీస్ ఎలాగైతే గ్లోబల్ గుర్తింపు తెచ్చిపెట్టిందో? మరొకరికి -హను-మాన్- క్రేజ్ తెచ్చింది. మైథాలజీ, హిస్టరీ, అడ్వెంచర్ ఎలిమెంట్స్ మిళితం చేసిన కథలను

ఎంచుకోవడంలో నిఖిల్, తేజలు ఒకే మైండ్‌సెట్‌తో ముందుకెళ్తున్నారు. ఈ రకమైన కంటెంట్ ఓరియెంటెడ్ ఎంపికలు టాలీవుడ్ స్థాయిని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కేవలం ప్రాంతీయ మార్కెట్‌కే పరిమితం కాకుండా ఉత్తరాది ప్రేక్షకులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకునేలా ఇద్దరు సబ్జెక్ట్‌లను ఎంచుకుంటున్నారు. భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న సినిమాలు బాక్సాఫీస్ వద్ద సేఫ్ బెట్‌గా మారడమే కాకుండా యంగ్ జనరేషన్ హీరోలకు కొత్త దిశానిర్దేశం చేస్తున్నాయి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965